
సాక్షి
విశాఖపట్నం

సోమవారం । 14 । ఆగస్టు । 2023



క్వీన్ మేరీస్‌లో డిజిటల్ సొబగులు

చారిత్రక నేపథ్యం గల క్వీన్ మేరీస్ పాఠశాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాంకేతికంగా అభివృద్ధి చేస్తోంది. 8లో



నాణేలు.. చరిత్ర జ్ఞాపికలు

స్టాంపులు, స్వాతంత్య్ర సమరయోధుల వస్తువులు, నాణేలు సేకరణలో జి.ఎస్.ప్రకాష్ ఆదర్శంగా నిలుస్తున్నారు. 8లో



అపురూపం.. ఆనాటి జ్ఞాపకం

హవామహల్‌లో సి.జె.నెహ్రూ ఆదివారం ఏర్పాటు చేసిన ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. 8లో

న్యూస్‌రీల్

నేటితో ముగియనున్న పాలిటెక్ ఆప్షన్ల గడువు



ఆప్షన్లు ఎంపిక చేసుకుంటున్న విద్యార్థులు

మురళీనగర్: పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశానికి సంబంధించి వెబ్ ఆప్షన్ల గడువు సోమవారంతో ముగియనుంది. దీంతో విద్యార్థులు ఆప్షన్ల ఎంపికతోపాటు వెబ్‌సైట్‌లో ఏర్పడుతున్న పలు సమస్యల పరిష్కారానికి హెల్ప్‌లైన్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. మూడు రోజులుగా కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ, ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రాల్లో అధికారులను సంప్రదించి లాగిన్, పాస్‌వర్డ్ క్రియేషన్ వంటి సమస్యలను పరిష్కరించుకున్నారు. ఆదివారం కూడా వీరు హెల్ప్‌లైన్ కేంద్రాలకు వచ్చి సిబ్బంది సహకారంతో ఆప్షన్లు పెట్టుకున్నారు. ఆప్షన్ల ఎంపిక సోమవారంతో ముగియనుండగా 16న ఆప్షన్లు మార్పిడి చేసుకునే అవకాశం ఉంది. ఈనెల 18న సీట్లు కేటాయిస్తారు.

'ఆర్‌ఎంపీల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా..'



సుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆర్‌ఎంపీలు

మహారాణిపేట: రాష్ట్రంలో ఉన్న సుమారు 48 వేల మంది గ్రామీణ వైద్యుల గుర్తింపు కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం స్థానిక సర్క్యూట్ హౌస్‌లో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి ఆధ్వర్యంలో వైవీ సుబ్బారెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి గ్రామీణ వైద్యుల సంక్షేమం కోసం జీవో 429 తీసుకొచ్చి జీవన భృతి కల్పించారని, సుమారు 80 వేల మంది శిక్షణ పూర్తి చేసుకున్నారని తెలిపారు. గౌరవ అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, జై భీమ్ కన్వీనర్, సంఘం సలహాదారు కోన ప్రకాష్ పాల్గొన్నారు.

వేగన్ నిర్వహణ యార్డ్‌లో డీఆర్‌ఎం పర్యటన



యార్డ్‌లోని మహిళా సిబ్బందితో మాట్లాడుతున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్ విశాఖపట్నం ఓర్ ఎక్స్ఛేంజ్ యార్డ్‌లో గల వేగన్ మెయింటెనెన్స్ యార్డ్‌లో ఆదివారం పర్యటించారు. ఆధునికీకరణ, నిర్వహణ కెపాసిటీ వంటి తదితర అంశాలపై డిఆర్‌ఎం తనిఖీలు చేశారు. యార్డ్‌లో గల సిబ్బంది, ఉద్యోగులు, అధికారులతో డీఆర్‌ఎం ముఖాముఖి మాట్లాడారు. ప్రత్యేకంగా యార్డ్‌లో విధులు నిర్వర్తిస్తున్న మహిళల బోగీ నిర్వహణ బృంద సిబ్బందితో మాట్లాడి, వారి సేవలను ప్రశంసించారు. ఓర్ ఎక్స్ఛేంజ్ యార్డ్‌లో గల డిస్పాచ్ యార్డ్, సిక్‌లైన్‌లను కూడా పరిశీలించారు. ఆయనతో పాటు సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ ఎస్.కె.పాత్రా, ఇతర అధికారులు ఉన్నారు.

చంద్రబాబు విశాఖ రాక రేపు

మహారాణిపేట: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఈనెల 15న విశాఖ వస్తున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో మధ్యాహ్నం 3 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి నేరుగా బీచ్‌రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహానికి చేరుకుంటారు. 4 గంటలకు బీచ్ వాక్ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం 5.30 గంటలకు ఎంజీఎం గ్రౌండ్‌లో ప్రముఖులు, యువకులతో సమావేశమవుతారు. రాత్రికి విశాఖలోని టీడీపీ కార్యాలయంలో బస చేస్తారు.

నేడు జీవీఎంసీలో జగనన్నకు చెబుదాం

దాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం(గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహించనున్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు.

మన ఆంధ్ర.. ఏపీఎల్

బీచ్‌రోడ్డులో ఉత్సాహంగా 3కే రన్





3కే రన్ ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి. చిత్రంలో మంత్రి అమర్‌నాథ్, మేయర్ హరివెంకటకుమారి, కలెక్టర్ మల్లికార్జున, ఏసీఏ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి, కోశాధికారి చలం, సీఈవో శివారెడ్డి, విశాఖ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు తదితరులు

విశాఖ స్పోర్ట్స్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) ఆధ్వర్యంలో బీచ్‌రోడ్‌లో మన ఆంధ్ర.. మన ఏపీఎల్ పేరిట ఆదివారం చేపట్టిన 3కే రన్ ఉత్సాహంగా సాగింది. వైఎస్సార్ సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి కాళీమాత ఆలయం వద్ద జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, కలెక్టర్ మల్లికార్జున క్రీడాజ్యోతిని వై.వి.సుబ్బారెడ్డికి అందించారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో కలిసి ఆయన ఏసీఏ కార్యదర్శి ఎస్.ఆర్.గోపీనాథ్‌రెడ్డికి క్రీడాజ్యోతిని అందజేశారు. సాగరతీరంలోని వైఎస్సార్ విగ్రహం చెంతకు చేరడంతో ఈ రన్ ముగిసింది. ముఖ్య అతిథులు రన్ చేసి యువ క్రికెటర్లలో క్రీడా స్ఫూర్తిని నింపారు.

ఈ నెల 16వ తేదీ నుంచి వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ప్రారంభం కానున్న ఏపీఎల్‌లో ఆరు జట్లు 19 మ్యాచ్‌లు ఆడనున్నాయి. 27న జరిగే టైటిల్ పోరుతో ఏపీఎల్ ముగియనుంది. ఆంధ్రా క్రికెటర్ల ప్రతిభను విశ్వవ్యాప్తం చేసేందుకు ఈ లీగ్ నిర్వహిస్తున్నట్లు ఏసీఏ కార్యదర్శి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీఏ కోశాధికారి ఎ.వి.చలం, సీఈవో ఎం.వి.శివారెడ్డి, విశాఖ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు, విశాఖ నుంచి తొలి అంతర్జాతీయ క్రీడాకారిణి స్నేహ దీప్తి, అండర్-19 వరల్డ్ కప్‌లో సత్తాచాటిన శశికాంత్, వైజాగ్ వారియర్స్, ఉత్తరాంధ్ర లయన్స్, కోస్టల్ రైడర్స్, రాయలసీమ కింగ్స్, బెజవాడ టైగర్స్, గోదావరి టైటాన్స్ జట్ల ఆటగాళ్లు, యజమానులు, ఔత్సాహిక క్రీడాకారులు పాల్గొన్నారు.



పరుగులో పాల్గొన్న క్రీడాకారులు, అభిమానులు

హ్యాపీ బర్త్‌డే పీచెస్

- జూలో ఘనంగా ఆడ తెల్లపులి పుట్టిన రోజు వేడుక
- నెల రోజుల పాటు దత్తత తీసుకున్న సీపీఈ యాజమాన్యం



విద్యార్థులతో కలసి కేక్ కట్ చేస్తున్న జూ క్యూరేటర్ నందనీ సలారియా



తెల్లపులి పీచెస్

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో పీచెస్ అనే ఆడ తెల్ల పులి పుట్టిన రోజు ఘనంగా జరిగింది. తెల్ల పులుల ఎన్‌క్లోజర్ వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సీపీఈ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. కొందరు విద్యార్థులు పులి మాస్కులు ధరించి సందడి చేశారు. విద్యార్థులతో కలిసి క్యూరేటర్ నందనీ సలారియా కేకు కట్ చేసి సందర్శకులకు పంచిపెట్టారు. సీపీఈ కళాశాల యాజమాన్యం ఆ పులిని నెల రోజుల పాటు దత్తత తీసుకుంది. పీచెస్ పుట్టి ఐదేళ్లు పూర్తయిందని, ఆరో సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా పుట్టిన రోజు వేడుక నిర్వహించామని క్యూరేటర్ తెలిపారు. నెల రోజుల పాటు పీచెస్‌కు అయ్యే ఖర్చును భరించేందుకు ముందుకొచ్చిన సీపీఈ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

కేజీహెచ్.. న్యూ లుక్



నూతనంగా నిర్మించిన ప్రధాన ద్వారం



రెండో క్యాజువాలిటీలో పడకలు

- సకల సదుపాయాలతో సిద్ధమైన రెండో క్యాజువాలిటీ
- ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన ప్రధాన ద్వారం
- నేడు మంత్రి విడదల రజిని చేతుల మీదుగా ప్రారంభం

మహారాణిపేట : ఉత్తరాంధ్ర ప్రజల ఆరోగ్య ప్రదాయిని కింగ్ జార్జ్ ఆస్పత్రిలో తీర్చిదిద్దిన రెండో క్యాజువాలిటీ, ప్రధాన ద్వారం ప్రారంభోత్సవం సోమవారం జరగనుంది. సాయంత్రం 5 గంటలకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని వీటిని ప్రారంభిస్తారు. కేజీహెచ్‌లో కార్పొరేట్ వైద్య సేవలు అందుతున్నాయి. దానికి తగ్గట్టుగానే ఆస్పత్రిలో పలు విభాగాలు తీర్చిదిద్దారు. ఇప్పుడు రెండో క్యాజువాలిటిని కూడా కార్పొరేట్ ఆస్పత్రిని తలదన్నే విధంగా తయారు చేశారు. ఇందుకు రూ.30 లక్షలు ఖర్చు చేశారు. లేబొరేటరీ, మొబైల్ ఎక్స్‌రే యూనిట్, అల్ట్రా స్కానింగ్, ఎయిర్‌కండిషన్, 20 ఆధునాతన పడకలు సిద్ధం చేశారు. అలాగే కేజీహెచ్‌లో రూ.30 లక్షలతో ప్రధాన ద్వారాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున చొరవ తీసుకొని వీఎంఆర్‌డీఏ నిధులతో ఈ ముఖ ద్వారం అందుబాటులోకి తీసుకొచ్చారు.

నలుగురు రేడియోగ్రాఫర్ల తొలగింపు

- కలెక్టర్ మల్లికార్జున ఆదేశాల జారీ
- డబ్బులు ముట్టజెప్పి ఉద్యోగాలు పొందిన వైనం
- అనర్హులకు పెద్దపీట వేశారని అప్పుడే చెప్పిన 'సాక్షి'

మహారాణిపేట: వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఏడుగురు రేడియోగ్రాఫర్లలో నలుగురు అనర్హులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వారిని వెంటనే తొలగించాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశాలు జారీ చేశారు. అనర్హులను ఎంపిక చేసిన అధికారుల వివరాలను ఇవ్వాలని డీఎంహెచ్‌వోను కలెక్టర్ కోరినట్లు సమాచారం. రేడియోగ్రాఫర్ల ఎంపికలో అక్రమార్కులకు పెద్దపీట వేశారని, డబ్బులు చేతులు మారినట్లు 'సాక్షి' గతంలో కథనం ప్రచురించింది. ఎస్.ఈశ్వరరావు అనే వ్యక్తి అనర్హులను ఎంపిక చేయడం వల్ల తను నష్టపోయానని స్పందనలో ఫిర్యాదు చేశాడు. రేడియోగ్రాఫర్ మెరిట్ జాబితా ఈ నెలతో ముగుస్తుందని, అందువల్ల అనర్హులను తొలగించి తనలాంటి వాళ్లకు అవకాశం ఇవ్వాలని పలుమార్లు స్పందనలో కోరాడు. ఈ నేపథ్యంలో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఎంపిక చేసిన ఏడుగురిలో నలుగురు అనర్హులు ఉన్నట్టు వైద్య ఆరోగ్యశాఖ అధికారుల విచారణలో తేలింది. ఒకరు కేజీహెచ్‌లో, మిగిలిన ముగ్గురు ఉమ్మడి విశాఖలో వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్నారు.

గత ఏడాది ఆగస్టు 5న రేడియోగ్రాఫర్ పోస్టుల భర్తీకి కలెక్టర్ పేరిట అప్పటి డీఎంహెచ్‌వో విజయలక్ష్మి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఏపీలో కంప్యూటర్ రేడియాలజీ అసిస్టెంట్(సీఆర్ఏ), డిప్లమో రేడియోగ్రాఫర్ అసిస్టెంట్(డీఆర్‌జీఏ), డిప్లమో మోడల్ ఇమేజింగ్ టెక్నీషియన్ (డీఎంఐటీ) కోర్సుల్లో పూర్తి చేసిన అభ్యర్థులను అర్హులుగా అందులో పేర్కొన్నారు. ఈ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు ఆంధ్రప్రదేశ్ పారా మెడికల్ బోర్డు(ఏపీపీఎంబీ) వద్ద రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలి. అయితే ఇక్కడే తేడా జరిగింది. వెయిటేజీ మార్కులు అదనంగా వేయడంతో పాటు ఏపీలో లేని కోర్సులు, ఏపీపీఎంబీ అనుమతి లేని వారి నుంచి ముడుపులు తీసుకొని ఉద్యోగాలు కట్టబెట్టారు. బీఎస్సీలో రేడియాలజీ ఇమేజింగ్ టెక్నీషియన్(ఆర్‌టీఐ)లో చదివినట్లు సర్టిఫికెట్ తీసుకొచ్చిన వారికి ఉద్యోగం ఇచ్చారు. ఇది నిబంధనలకు విరుద్ధమని ఈశ్వరరావు స్పందనలో ఫిర్యాదు చేశాడు. అప్పటి డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, ఎంపిక అధికారి, సీనియర్ వైద్యుడు స్టీఫెన్ రవీంద్ర, ఏపీ వైద్య విధాన పరిషత్ జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రమేష్ కిశోర్, కార్యాలయం సిబ్బంది అనర్హుల ఎంపికలో కీలకపాత్ర పోషించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి.

పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తాం

ఏడుగురిలో నలుగురికి వెయిటేజీ మార్కులు కలపడం, ఏపీలో లేని కోర్సుల ఆధారంగా ఎంపిక చేసినట్టు గుర్తించాం. వీరిని తొలగించాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పూర్తి నివేదిక అందజేయాలని కోరారు. దీంతో స్పందనలో వచ్చిన ఫిర్యాదు, అభ్యర్థుల వివరాలపై ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ సమన్వయ అధికారికి లేఖ రాశాం. అక్కడ నుంచి వచ్చిన వివరాలు, సర్టిఫికెట్ పరిశీలన అనంతరం కలెక్టర్‌కు నివేదిక ఇస్తాం. ఆ తర్వాత అర్హులను ఎంపిక చేస్తాం.

– డాక్టర్ పి.జగదీశ్వరరావు, డీఎంహెచ్‌వో

ఒకరి దానం.. మరొకరికి ప్రాణం

- అవయవదానంపై మరింత అవగాహన
- కలెక్టర్ మల్లికార్జున
- అవయవదాతల కుటుంబ సభ్యులకు సత్కారం



వెంకట సంతోష్ కుటుంబ సభ్యులను సత్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

బీచ్‌రోడ్డు: వైద్య రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రంలో అవయవదానం చేసిన వారి కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హార్ట్ ఫెయిల్యూర్‌తో బాధపడుతున్న 16 ఏళ్ల చిన్నారికి జీవన్‌దాన్ ద్వారా గుండె మార్పిడి చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం సుమారు కోటి రూపాయలు ఖర్చు చేసిందన్నారు. అవయవదానంపై మూడేళ్లుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. మరింతగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 5 లక్షల మంది అవయవాలు వైఫల్యం చెందుతున్నాయని చెప్పారు. వారిలో కేవలం 10 శాతం మంది వైద్యం చేసుకుని జీవించగలగుతున్నారని.. మిగిలిన వారు మరణిస్తున్నారని తెలిపారు. ఈ వ్యత్యాసాన్ని తగ్గించాలంటే ప్రజలు అవయవదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల నుంచి అవయవాలు సేకరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అవయవదానం చేసిన కుటుంబ సభ్యుల వైద్య ఖర్చుల్లో 50 శాతం రాయితీని ప్రకటించిన కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి యాజమాన్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా అవయవదానం ప్రతిజ్ఞ ఫ్లెక్సీపై సంతకం చేశారు.

తొలి ప్రభుత్వ ఆస్పత్రి విమ్స్

బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి నుంచి అవయవాలను సేకరించిన రాష్ట్రంలోనే మొదటి ప్రభుత్వ ఆస్పత్రి విమ్స్ అని జీవన్‌దాన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్, విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు అన్నారు. ఇప్పటి వరకు విమ్స్‌లో ఇద్దరి నుంచి అవయవాలను సేకరించినట్లు వెల్లడించారు. అవయవదానంపై ప్రజల్లో చాలా సందేహాలు, అపోహలు ఉన్నాయని.. వాటిని విడిచి పెట్టాలని సూచించారు. అవయవాలు దానం చేసేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కేవలం మన రాష్ట్రంలోనే అవయవాల కోసం 3 వేల మంది పేర్లు నమోదు చేసుకున్నారని, పేర్లు నమోదు చేసుకోని వారి సంఖ్య వేలల్లో ఉంటుందన్నారు. కార్యక్రమంలో భాగంగా అవయవదానం చేసిన 15 మంది కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు. రెడ్‌క్రాస్ సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శివ నాగేందర్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, విమ్స్ ఆస్పత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పలు కళాశాలలకు చెందిన వైద్య విద్యార్థులు, ఎన్జీవోలు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఐదుగురికి 'సంతోష్'ం అందించాడు

అనుకోని ప్రమాదంలో సంతోష్ మాకు దూరం అయ్యాడు. కానీ మేము సంతోష్ అవయవాలను దానం చేసి మరో ఐదుగురి జీవితాల్లో సంతోషం నింపగలిగామన్న సంతృప్తి ఉంది. అవయవాలను మట్టిలో కలిసిపోయేలా చేసే కంటే.. వేరొకరి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఉపయోగపడాలి. ఈ రోజు చాలా మంది మా కుటుంబాన్ని అభినందిస్తున్నారు.

– వెంకట సంతోష్ కుటుంబ సభ్యులు, ఆరిలోవ

జీవన్‌దాన్ వల్లే బతికి ఉన్నా..




నేను నాలుగేళ్లగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాను. కిడ్నీ మార్పిడికి నా తల్లిదండ్రుల మూత్రపిండాలు సరిపడలేదు. ఈ నాలుగేళ్ల నరకం చూశాను. ఈ రోజు నేను బతికి ఉన్నానంటే అది కేవలం జీవన్‌దాన్ వలనే. జీవన్‌దాన్‌లో నాకు ఓ కిడ్నీ కేటాయించారు. జూన్ 26న మార్పిడి చేశారు. ఇప్పుడు చాలా సంతోషంగా జీవిస్తున్నాను. ప్రతి ఒక్కరూ అవయవదానానికి ముందుకొచ్చి నాలాంటి వారికి నూతన జీవితాన్ని ప్రసాదిస్తారని కోరుతున్నాను.

– రవితేజ, విజయనగరం

ఎవరి కోసమో గాజువాక వదులుకోం

- వచ్చే ఎన్నికల్లో జనసేన పోటీ
- బహిరంగ సభలో పవన్ కల్యాణ్




గాజువాక : వచ్చే ఎన్నికల్లో గాజువాకలో జనసేన జెండా ఎగురుతుందని ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ స్థానాన్ని తాము ఎవరి కోసమో వదులుకోలేదని తేల్చి చెప్పారు. మూడో దశ వారాహి యాత్రలో భాగంగా గాజువాకలో ఆదివారం రాత్రి ఆయన బహిరంగ సభ నిర్వహించారు. తొలుత మల్కాపురం, శ్రీహరిపురం, కొత్తగాజువాక, సినిమాహాల్ జంక్షన్ మీదుగా పాతగాజువాకలోని సభాస్థలికి ర్యాలీగా తరలివచ్చారు. అనంతరం సభలో మాట్లాడుతూ తాను గాజువాక నియోజకవర్గాన్ని వదలబోనని అన్నారు. ఇది తన నియోజకవర్గమని, ఇక్కడ నుంచి జనసేన తప్పకుండా పోటీ చేస్తుందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు సభికులను గందరగోళానికి గురి చేశాయి. ప్రతి విషయంలోను తాను పోరాడతానంటూ చెప్పుకొచ్చిన ఆయన స్టీల్ ప్లాంట్ విషయంలో కేంద్రాన్ని బ్రతిమలాడుదామని, ప్రాధేయపడదామంటూ పదేపదే చెప్పుకొచ్చారు. సభలో స్థానిక నాయకులకు ఎటువంటి ప్రాతినిధ్యం కల్పించకపోవడం చర్చనీయాంశంగా మారింది. పవన్ కల్యాణ్ వారాహి రాగానే అభిమానులు ఒక్కసారిగా ఎగబడటానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని అదుపుచేశారు. మార్గంమధ్యలో మల్కాపురం మరిడిమాంబ ఆలయం వద్ద కొంతమంది యువకులు జై జగన్ అంటూ అనే నినాదాలు చేయడం విశేషం.

ఉత్కంఠగా టెన్నిస్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: జిల్లా స్థాయి జూనియర్ టెన్నిస్ టోర్నీలో హోరాహోరీగా సాగిన పోరులో హాసిని, శౌర్య విజేతలుగా నిలిచారు. విశాఖలోని సింథటిక్ టెన్నిస్ కోర్టులో ఆదివారం ఫైనల్స్ ఉత్కంఠగా సాగాయి. అండర్-10 నుంచి 16 వరకు నాలుగు ఏజ్ కేటగిరిల్లో బాలబాలికలకు ఈ పోటీలు నిర్వహించారు. బాలుర అండర్-16 ఫైనల్స్‌లో కె.శౌర్య 9-6తో వై.ఆర్నవ్‌పై విజయం సాధించాడు. బాలికల అండర్-14 ఫైనల్స్‌లో ఆర్.హాసిని 9-7తో ఎ.ఆరుషీపై విజయం సాధించింది. అండర్-16 ఫైనల్‌లో మోక్షధనుంజయ్ 9-0తో ఆరుషీపై విజయం సాధించింది. అండర్-10 బాలుర ఫైనల్స్‌లో రేవంత్‌రిషీ 9-2తో బి.దాత్రేష్‌పై విజయం సాధించాడు. బాలికల అండర్-12 ఫైనల్స్‌లో పి.సేవిత9-4తో అలీషాపై విజయం సాధించింది. బాలికల అండర్-10 ఫైనల్స్‌లో జి.రిషికమధో 9-5తో సుధీక్షణపై విజయం సాధించింది.

మా వలంటీర్ వెంకటేష్ కాదు.. విజయలక్ష్మి

మృతురాలు వరలక్ష్మి భర్త గోపాలకృష్ణమూర్తి వెల్లడి



సింహాచలం: వెంకటేష్ వలంటీర్‌గా పనిచేస్తున్నాడనే సంగతి తమకు తెలియదని జీవీఎంసీ 95వ వార్డు సుజాతనగర్‌లోని 80 ఫీట్ రోడ్డులో ఇటీవల హత్యకు గురైన వృద్ధురాలు కోటగిరి వరలక్ష్మి భర్త గోపాలకృష్ణమూర్తి తెలిపారు. వరలక్ష్మిని వలంటీర్ వెంకటేష్ హత్య చేశాడని పదేపదే కూస్తున్న ఎల్లో మీడియాతోపాటు కొన్ని అనుబంధ మీడియా సంస్థలకు కనువిప్పు కలిగే నిజాలను ఆయన తెలిపారు. ఆదివారం ఆయన సాక్షి మీడియాతో మాట్లాడుతూ... గత నెల 31న సుజాతనగర్ 80 ఫీట్ రోడ్డులోని ఒక అపార్ట్‌మెంట్‌లో వృద్ధురాలు వరలక్ష్మి హత్య జరిగిన విషయం తెలిసిందే. ఆమె భర్త, కుమారుడు నడుపుతున్న మొబైల్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో పనిచేసే వెంకటేష్ వృద్ధురాలిని హత్య చేశాడు. అయితే వెంకటేష్ వలంటీర్ అని ఎల్లో మీడియాతోపాటు, ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. కానీ కొద్ది రోజుల క్రితమే వెంకటేష్‌ని వలంటీర్‌గా తొలగించామని జీవీఎంసీ జోన్ – 8 కమిషనర్ మల్లయ్య నాయుడు తెలిపారు. అయినప్పటికీ పదే పదే వలంటీర్ వ్యవస్థపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ విమర్శలు చేయడం, గత శుక్రవారం సుజాతనగర్‌లోని వృద్ధురాలి ఇంటికి వెళ్లి పవన్ పరామర్శించిన క్రమంలో మృతురాలి భర్త గోపాలకృష్ణమూర్తి మాటలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అసలు వెంకటేష్ తమ ఏరియాకి... తమ అపార్ట్‌మెంట్‌కు వచ్చే వలంటీర్ కాదని, అతను వలంటీర్ అన్న విషయమే తనకు తెలియదంటున్నారు. తమ ఇంటికి వచ్చే వలంటీర్ విజయలక్ష్మి అని, ఆమె సమయానికి సమాచారం, పింఛన్ల నగదు అందిస్తోందని పేర్కొన్నారు.

అపురూపం.. ఆనాటి జ్ఞాపకం



కెమెరాలను ఆసక్తిగా తిలకిస్తున్న సందర్శకులు



ప్రదర్శనలో పురాతన కెమెరాలు

ఆకట్టుకున్న పురాతన కెమెరాల ప్రదర్శన

బీచ్‌రోడ్డు: 19వ శతాబ్దం నాటి కెమెరాలు, జేమ్స్ బాండ్ చిత్రాల్లోని స్పై కెమెరాలను ఎప్పుడైనా చూశారా? చూడని వారి కోసం విజయనగరానికి చెందిన సి.జె.నెహ్రూ తను సేకరించిన కెమెరాలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. హవామహల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. కార్ల్ జీస్ ప్లేట్ ఫిల్మ్ కెమెరా(1928), వోయిట్ ల్యాండర్(1950), కొడాక్ 620, 1935 బాక్స్ కెమెరా తదితర 83 కెమెరాలను ఆయన సేకరించారు. అతని సేకరణలలో అగ్ఫా గెవార్ట్ బాక్స్ (1940), యాషికా మాట్ 124 జీ అనే రెండు మినాక్స్ డిజిటల్ స్పై కెమెరాలు ఉన్నాయి. జేమ్స్ బాండ్ చిత్రాల్లో వినియోగించారని నెహ్రూ తెలిపారు. ఈ కెమెరాలను ఢిల్లీ, హైదరాబాద్, ముంబయి తదితర నగరాల్లో కొనుగోలు చేసినట్లు వివరించారు. ఈ కెమెరాలను నగర ప్రజలు తిలకించి.. వాటి వివరాలు తెలుసుకున్నారు.

త్రివర్ణ తీరం





స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని వరల్డ్ వన్ స్కూల్ విద్యార్థులు ఆదివారం బీచ్‌రోడ్డులో త్రివర్ణ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. 50 అడుగుల జాతీయ జెండాతో వైఎంసీఏ నుంచి ఆర్.కె.బీచ్ వరకు సాగిన ఈ ర్యాలీ అందరిలో దేశభక్తిని నింపింది. అలాగే పలువురు విద్యార్థులు ఆర్.కె.బీచ్‌లో త్రివర్ణ పతాకాలతో సందడి చేశారు. - బీచ్‌రోడ్డు

ఉత్సాహంగా డెడ్ లెఫ్ట్ చాంపియన్‌షిప్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఏపీ స్టేట్ యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి

పెదగంట్యాడ : ఏపీ స్టేట్ పవర్ లిఫ్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 5వ ఏపీ స్టేట్ బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ 2023, సెకండ్ ఏపీ స్టేట్ డెడ్ లెఫ్ట్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. జీవీఎంసీ 76వ వార్డు పరిధి హౌసింగ్ బోర్డు కాలనీలో గల సీడబ్ల్యూసీలో నిర్వహించిన ఈ పోటీలను హైకోర్టు న్యాయవాది, ఏపీ స్టేట్ యాత కార్పొరేషన్ డైరెక్టర్ అండిబోయిన లక్ష్మి ప్రారంభించారు. పోటీలకు విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, నంద్యాల, కాకినాడ, కర్నూలు, గుంటూరు తదితర జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, మాస్టర్స్ మెన్ అండ్ వుమెన్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో విజేతలను జాతీయ స్థాయి పోటీలకు పంపించనున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ పవర్ లిఫ్టర్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు అండిబోయిన అప్పారావు, భాస్కరరావు, అండిబోయిన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సరి'కొత్త' జోష్

- గతంలో ఉన్న 8 మండలాలు తాజాగా 11కు పెంపు
- విశాఖ అర్బన్‌ను నాలుగు మండలాలుగా విభజన
- కొత్త మండలాల్లో ఇద్దరేసి ఎంఈవోలు నియామకం
- జిల్లాలో భీమిలి కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటు
- ఇక నుంచి ఇద్దరు డిప్యూటీ డీఈవోలు
- కొత్త డివిజన్‌లో సిబ్బందిని కేటాయిస్తూ ఉత్తర్వులు

విశాఖ విద్య : జిల్లా విద్యాశాఖలో సరికొత్త జోష్ కనిపిస్తోంది. జిల్లాలో ఇప్పటివరకు ఉన్న ఎనిమిది మండలాల స్థానంలో కొత్తగా మరో మూడు మండలాలు ఏర్పాటయ్యాయి. వీటికి ఇద్దరేసి ఎంఈవోల నియామకం సైతం పూర్తి కావటంతో విద్యాకార్యకలాపాలపై పర్యవేక్షణ పెరిగే అవకాశం కలిగింది. జిల్లాల పునర్విభజన తరువాత భౌగోళికంగా (ఉమ్మడి జిల్లాలో 11,161 చ.కి.మీ విస్తీర్ణం ఉండగా.. పునర్విభజన తరువాత విశాఖ జిల్లా 1,869 చ.కి.మీ విస్తీర్ణం) రాష్ట్రంలో మరే జిల్లాలో లేని సౌలభ్యం విశాఖపట్నంకు ఉండటంతో విద్యాశాఖలో ఇక్కడ పనిచేసేందుకు అధికారులు సైతం ఎంతో ఉత్సాహం చూపుతున్నారు. భీమునిపట్నం కేంద్రంగా ఏర్పాటైన డివిజన్‌కు డిప్యూటీ డీఈవో, కార్యాలయ సిబ్బంది పోస్టులను కేటాయిస్తూ మంగళవారం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేయటంతో విద్యాశాఖలో మరింత జోష్ కనిపిస్తోంది.

రెండు డివిజన్లు–ఇద్దరు డిప్యూటీ డీఈవోలు

జిల్లాలో ప్రస్తుతం ఒకే డిప్యూటీ డీఈవో ఉండగా, మరో డిప్యూటీ డీఈవో పోస్టు మంజూరు కావటం ద్వారా విద్యాకార్యకలపాలపై ఉన్నతాధికారులు పర్యవేక్షణ పెరగనుంది. విశాఖపట్నం డిప్యూటీ డీఈవో పరిధిలో గాజువాక, గోపాలపట్నం, మహారాణిపేట, ములగాడ, పెందగంట్యాడ, పెందుర్తి మండలాలు కేటాయించారు. భీమునిపట్నం డివిజన్ కేంద్రంగా ఆనందపురం, భీమునిపట్నం, పద్మనాభం, విశాఖపట్నం రూరల్, సీతమ్మధార మండలాల్లో పరిధిలో గల పాఠశాలలపై పర్యవేక్షణ కొనసాగనుంది.

నాడు ఒక్కరే– నేడు ఎనిమిది మంది ఎంఈవోలు

విశాఖ నగరంలో ఇటీవల వరకు అర్బన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ (ఎంఈవో సమాన కేడర్) సగం వరకు స్కూళ్లపై పర్యవేక్షణ చేయాల్సి వచ్చేది. దీని వల్ల పాఠశాలలపై సరైన పర్యవేక్షణ ఉండేది కాదు. గత పాలకులెవ్వరూ ఇటువంటి సమస్యపై దృష్టి సారించకపోవటంతో నగరంలో విద్యా వ్యవస్థ అధ్వానంగా ఉండేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఏర్పడిన కొత్త మండలాల కారణంగా విద్యాశాఖలోని అర్బన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ పరిధిలో సీతమ్మధార, మహారాణిపేట, గోపాలపట్నం, ములగాడ మండలాలు ఏర్పాటయ్యాయి. ఒక్కో మండలానికి ఇద్దరేసి ఎంఈవోలు అందుబాటులోకి రావటం ద్వారా పాఠశాలలపై పూర్తిస్థాయిలో పర్యవేక్షణకు అవకాశం ఏర్పడింది. జీవీఎంసీ పరిధిలో పనిచేసే ఉపాధ్యాయులకు సకాలంలో వేతనాలు చెల్లింపు, సర్వీసు పరమైన ఇతర సమస్యలు సైతం సకాలంలో పరిష్కారం కానున్నాయి.

విద్యాహబ్‌గా విశాఖ

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 1,385 పాఠశాలలు ఉండగా, 2022–23 లెక్కల ప్రకారం 3,72,134 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రాథమిక విద్యకు పటిష్టమైన పునాదులు వేసే ధీటైన విద్యాలయాలు విశాఖ నగరంలో ఉండటంతో ఉత్తరాంధ్ర జిల్లా నుంచి సైతం విద్యార్థులను ఇక్కడ చేర్పిస్తున్నారు. దీంతో విశాఖ జిల్లా విద్యాహబ్‌గా మారింది. మిగతా జిల్లాలతో పోలిస్తే, భౌగోళికంగా తక్కువ విస్తీర్ణం ఉండటంతో పర్యవేక్షణకు అనువుగా ఉన్నందున ఇక్కడ పనిచేసేందుకు అధికారులు సైతం మొగ్గు చూపుతున్నారు. చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తూ, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా విద్యాభివృద్ధిలో అధికారులు సైతం కీలక పాత్ర పోషిస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

ONE SITTING

- One Sitting : 10th, Inter, Degree (All), PG (All), BBA, BCA, MBA, MCA, Dip. Engg., B.Tech, M.Tech, Dip. VET, Nursing, Pharmachy, B.Ed, Ph.D from Govt. Recog. Univs. Ph : 83417 74299 [V- 794478]

Real Estate

R/E WANTED

- సైట్ లీజ్‌కు కావలెను. (MNC కంపెనీ) కొరకు రోడ్ ఫేసింగ్ 40 సెంట్లు నుండి 1 ఎకరాం వరకు. శ్రీకాకుళం, వైజాగ్, విజయనగరం జిల్లాలు. ఫోన్ : 98483 26807 [V-10972]

RENT / SALE

- NAD జంక్షన్, శాంతినగర్. 3150 Sq.Feet (or) 1495 Sq.Feet. గ్రౌండ్‌ఫ్లోర్, కమర్షియల్ ఫ్లాట్ సేల్‌కి లేదా అద్దెకు కలదు. సంప్రదించండి : 90102 45443, 94944 02045 [V- 2651]

WANTED LAND

- ప్రముఖ విద్యాసంస్థకు మధురవాడ, కొమ్మాది, తగరపువలస ఏరియాలో ఎకరం 10 సెంట్లు స్థలము ఉండి 40,000/- Sft, బిల్డింగ్ కట్టి అద్దెకు ఇచ్చుటకు ఆసక్తి గలవారు సంప్ర : 94924 32299 [V-794591]

Services

GOLD LOANS

- లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 10745]
- బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్ ✆ 76508 91999 [B-788204]
- బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. సంప్ర॥ ✆ 99481 66555 [B-1193214]

MARRIAGE SERVICES

- క్రైస్తవ, హిందూ, మాలల వివాహ పరిచయ వేదిక. తేది: 15-08-2023 సా. 5 గం. నుండి రా. 8గం. వరకు. పబ్లిక్ లైబ్రరి, B.V.K. కాలేజి వద్ద, ద్వారకానగర్, విశాఖపట్నం ✆ 94412 41468 [B-788151]

SEPTIC TANK CLEAN

- సుధాకర్ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్స్ హైటెక్ మిషన్‌తో అతితక్కువ ఖర్చుతో ఇరుగుపొరుగు వారికి ఎటువంటి దుర్వాసన లేకుండా 10 ని॥ల్లో క్లీన్ చేయబడును. ఫోన్ : 98488 06516, 90149 03518 [V-2078]

Wanted

- NAD ప్రముఖ విద్యా సంస్థలో 2 సం॥ అనుభవం ఉన్న 25 to 35 years Lady Coordinator కావలెను. అర్హత : డిగ్రీ. CV Send : abcindia729@gmail.com ఫోన్ : 97010 39939 [V- 797263]
- న్యూ బ్రాంచ్ ఆఫీస్‌లో టీం లీడర్స్, రిటైర్డ్, గృహిణులు, స్టూడెంట్స్, నిరుద్యోగులు, అర్జెంటు జాయిన్. P/T : 18,500/-, F/F : 23,500/-. ఫోన్ : 90149 87064 [V- 794688]
- శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నందు దిగువ బ్రాంచ్‌లో పనిచేయుటకు యువతీ / యువకులు కావలెను. ద్వారకానగర్, MVP, మహారాణిపేట, మధురవాడ, NAD, పెందుర్తి, కొత్తవలస ఏరియాలో రికవరి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ స్టాఫ్ కావలెను. అర్హత : డిగ్రీ పాస్, వయస్సు : 28 సం॥లోపు. సంప్ర : 89783 80138, 90004 04176 [V- 11666]
- మీ మొబైల్ ద్వారా మా కంపెనీ అడ్వర్టైజ్‌మెంట్ పంపుతూ వారం వారం అధిక ఆదాయం పొందండి. మీ అడ్రస్ వాట్సప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221515]
- త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K, ఏజెంట్ కమీషన్ 3K ఫోన్ : 9848571888 [HA-502]
- MS కంపెనీ నందు ఇంటి నుంచి పార్ట్‌టైమ్ /ఫుల్ టైమ్ వర్క్ చేయుటకు టెలికాలర్స్ కావలెను. మేల్/ఫిమేల్, Qly. 10th, జీతం: 16,000 –18,000 Ph: 9989923178/ 7075227337 [HA-498]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మురళీనగర్, మాధవధార	: 90101 33346
NAD, కంచరపాలెం	: 90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	: 70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	: 90100 55116
దాబాగార్డెన్స్, జగదాంబ MVP కోలనీ, మద్దిలపాలెం	90101 96663
గాజువాక	: 97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా

నాలుగు లైన్లు రూ.475/-

అదనపు లైను రూ.100/-

+ 5% జి.ఎస్.టి. అదనం

చారిత్రక బడికి డిజిటల్ సొబగులు

ప్రభుత్వ క్వీన్ మేరీస్ బాలికోన్నత పాఠశాల.. శతాబ్దాల చరిత్రకు నిలువెత్తు సాక్ష్యం. తొలుత బ్రిటిష్ వారి ఆయుధాగారం. తర్వాత కలెక్టరేట్‌గా, నర్సింగ్ శిక్షణ, వితంతు యువతుల పునరావాస, విద్యా కేంద్రంగా మారింది. 1913 నుంచి క్వీన్ మేరీస్ బాలికలకు విద్యాబుద్ధులు చెప్పే కేంద్రంగా అవతరించింది. ఇంతటి చారిత్రక నేపథ్యం ఉన్న ఈ పాఠశాల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సాంకేతికంగా అభివృద్ధి చెందుతోంది. నాడు–నేడు పథకంలో రూ.56 లక్షలతో పాఠశాలలో ఆధునిక వసతులు సమకూరాయి.

- క్వీన్ మేరీస్ పాఠశాలలో రూ.56 లక్షలతో వసతులు
- అందుబాటులో సైన్సు, కంప్యూటర్ ల్యాబ్‌లు
- ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌తో మెరుగైన బోధన



ఐఎఫ్‌పీ సాయంతో బోధిస్తున్న ఉపాధ్యాయురాలు



కంప్యూటర్ ల్యాబ్‌లో విద్యార్థినులు

విశాఖ విద్య : చారిత్రక నేపథ్యం ఉన్న క్వీన్ మేరీస్ పాఠశాలను గత పాలకులు ఏ మాత్రం పట్టించుకోలేదు. విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న సీఎం జగన్ ప్రభుత్వం నాడు–నేడులో భాగంగా తొలి విడతలో ఈ పాఠశాల అభివృద్ధికి రూ.56 లక్షలు కేటాయించింది. డిజిటల్ బోధనకు అవసరమైన పరికరాలను ఏర్పాటు చేసింది. 3 నుంచి 10వ తరగతి వరకు నిర్వహిస్తున్న ఈ స్కూల్‌లో వెయ్యి మందికి పైగా విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. ఇదే ప్రాంగణంలో మరో 35 మందితో ప్రైమరీ స్కూల్ కొనసాగుతోంది. 42 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. పాఠశాల చుట్టుపక్కల ప్రాంతమంతా స్లమ్ ఏరియా కావడంతో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన విద్యార్థినులే ఇక్కడ చదువుతున్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా ఇక్కడి విద్యార్థినులు చదువుల్లో రాణించేలా ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తున్నారు. పాఠశాలలో వసతులు, విద్యాబోధనకు అవసరమైన సామగ్రిని సమకూర్చేందుకు జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది.

డిజిటల్ బోధనతో విద్యార్థుల్లో జోష్

బాలికా విద్యను ప్రోత్సహించేలా క్వీన్ మేరీస్ పాఠశాలలో డిజిటల్ విద్యాబోధనకు ప్రాధాన్యం ఇస్తున్నారు. కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ అందుబాటులో ఉంది. అధునాతన సైన్స్ ల్యాబ్‌ను సమకూర్చేందుకు ఓ స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చి, అవసరమైన పరికరాలను సైతం సరఫరా చేసింది. త్వరలోనే ఇది వినియోగంలోకి రానుంది. డిజిటల్ విద్యలో భాగంగా పాఠశాలకు 16 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్(ఐఎఫ్‌పీ), రెండు స్మార్ట్ టీవీలను తరగతి గదుల్లో అమర్చారు. వీటి ద్వారా ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను బోధన చేస్తున్నారు. విద్యార్థినులు రెట్టించిన ఉత్సాహంతో చదువుల్లో ముందుకెళ్తున్నారు.

సమన్వయంతో పనిచేస్తున్నాం



ఎంతో ప్రతిష్టాత్మకమైన క్వీన్ మేరీస్ స్కూల్‌లో చదువుకునే బాలికల అభ్యున్నతికి ఉపాధ్యాయులంతా అంకితభావంతో పనిచేసేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. ఐఎఫ్‌పీల ఏర్పాటు విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా ఉంది. అధికారులు, దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధికి పాటుపడుతున్నాం. – వి.జోగేంద్రనాథ్, ప్రధానోపాధ్యాయుడు

విద్యార్థినులకు మేలు జరిగేలా బోధన



పేద వర్గాలకు చెందిన వారే ఎక్కువగా చదువుకుంటున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పించేలా కృషి చేస్తున్నాం. బోధనకు అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థినులు చదువుల్లో రాణించేలా వారికి అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాల బోధన చేస్తున్నాం. – ధర్మేంద్రరెడ్డి, సీనియర్ ఉపాధ్యాయుడు

సౌకర్యాలు మెరుగయ్యాయి



బడిలో గతంలో కన్నా సౌకర్యాలు బాగా మెరుగుపడ్డాయి. ట్యాబ్‌ల ద్వారా బైజూస్ పాఠ్యాంశాలు బాగున్నాయి. ఇంగ్లిష్ మీడియం చదవాలనే కోరిక తీరింది. బోర్డులపై బోధన కన్నా ఐఎఫ్‌పీలతో పాఠాలు ఇంకా బాగా అర్థమవుతున్నాయి. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటున్నాం. – జి.సత్యకావ్య, 9వ తరగతి

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.59,620
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.54,650
వెండి(కిలో):	రూ.76,200

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం	: రూ.107
బ్రాయిలర్ (లైవ్)	: రూ.127
స్కిన్	: రూ.224
స్కిన్‌లెస్	: రూ.234

నేడు డయల్ యువర్ ఆర్డీవో

మహారాణిపేట: విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.హుస్సేన్ సాహెబ్ డయల్ యువర్ ఆర్డీవో కార్యక్రమం సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహిస్తున్నారు. ప్రజలు తమ సమస్యలను 0891–2562977 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు.

'కొత్తపల్లి'లో సండే సందడి



కొత్తపల్లి జలపాతం వద్ద పర్యాటకుల సందడి

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతం వద్ద ఆదివారం సందడి నెలకొంది. ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలకు, విద్యాసంస్థలకు ఆదివారం సెలవు కావడంతో పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల్లో భారీగా తరలివచ్చారు. జలపాతంలో స్నానాలు చేస్తూ ఉత్సాహంగా గడిపారు.

బిల్డింగ్ పైనుంచి పడి భవన నిర్మాణ కార్మికుడి మృతి



మృతుడు పాకిరి నాయుడు

కూర్మన్నపాలెం : నిర్మాణంలో ఉన్న బిల్డింగ్‌పై నుంచి పడి ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన సంఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం కింతలవానిపేట గ్రామానికి చెందిన పాకిరి నాయుడు(45) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. భార్య రమణమ్మ, కూతురు సీతామహాలక్ష్మి, అల్లుడు ఉమాశంకర్‌తో కలిసి కూర్మన్నపాలెంలోని కాశీపాలెంలో నివాసముంటున్నాడు. ఆదివారం కూర్మన్నపాలెం పరిధి వుడా ఫేస్–7 ద్వారకపూరి కాలనీలో గల గ్లోరియా స్కూల్ పక్కన ఓ ఇంటి నిర్మాణ పనుల్లో భాగంగా లిఫ్ట్‌లో మెటీరియల్‌ను తీసుకువెళ్తున్న క్రమంలో 3వ ఫ్లోర్ పై నుంచి జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బొర్రాకు భారీగా పర్యాటకులు


రెండు రోజుల్లో 6.5 లక్షల ఆదాయం



బొర్రా గుహలను తిలకిస్తున్న పర్యాటకులు

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు శని, ఆదివారాల్లో పర్యాటకులు పోటెత్తారు. రెండు రోజులు సెలవులు కావడంతో మన్యం అందాలను తిలకించేందుకు పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. బొర్రాగుహలను శనివారం మూడు వేల మంది తిలకించగా రూ.2.5 లక్షలు, ఆదివారం ఐదు వేల మంది తిలకించగా రూ.4 లక్షల ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు. సందర్శిత ప్రాంతాలన్నీ రెండు రోజులు కళకళలాడాయి. కటికి, తాటిగుడ, సరియా, చిట్టంపాడు జలపాతాలు, కాఫీ ప్లాంటేషన్, డముకు వ్యూపాయింట్ పర్యాటకులు రాకతో సందడిగా మారింది.

ప్రత్యేక నాణేలు.. చరిత్ర జ్ఞాపికలు



గాంధీజీ వాడిన జేబు గడియారం



సేకరించిన స్టాంప్‌లు, నాణేలతో శివప్రకాష్

మద్దిలపాలెం: ఆయన స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనలేదు. కానీ నాటి ఉద్యమానికి సంబంధించిన స్టాంపులు, సమరయోధుల వస్తువులు, నాణేలు సేకరించి.. ఈ తరానికి స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని అందిస్తున్నారు. ఆయనే నగరానికి చెందిన శివప్రకాష్. జీవీఎంసీ 15వ వార్డు జె.ఆర్.నగర్ కాలనీకి చెందిన డీసీసీబీ విశ్రాంతి మేనేజర్ శివప్రకాష్‌కు చిన్ననాటి నుంచే పురాతన వస్తువుల సేకరణపై ఆసక్తి ఉంది. అలా సేకరించిన వాటిలో వస్తువులను సందర్భానుచితంగా తన ఇంట్లోనే ప్రదర్శనలు ఏర్పాటు చేసి నేటి తరానికి నాటి ప్రముఖుల జీవిత విశేషాలు తెలియజేస్తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ఉద్యమంలో పాల్గొన్న సమరయోధుల స్టాంపులు, నాణేలు, వస్తువులను తాజాగా తన ఇంట్లో ప్రదర్శించి.. విద్యార్థులకు వాటి ప్రాధాన్యాన్ని వివరిస్తున్నారు.

అరుదైన రికార్డుల సేకరణ

స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా గాంధీజీ అహింసా, ఉప్పు సత్యాగ్రహం గురించి చేసిన వ్యాఖ్యలను అమెరికా అప్పట్లో ఒక అట్ట రికార్డుపై పొందుపరిచింది. ఆ రికార్డును శివప్రకాష్ సేకరించి ప్రదర్శనలో పెట్టారు. 5వ కింగ్ జార్జ్ చక్రవర్తి ఘనత తెలియజేసే ప్రసంగం రికార్డును సేకరించారు. హౌస్ ఆఫ్ లార్డ్స్ రాయల్ గ్యాలరీలో పొందుపరిచిన అరుదైన రికార్డు లండన్ మ్యూజియంలో ఒకటి ఉండగా.. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో మరొకటి, మూడవది తన వద్ద ఉందని శివప్రకాష్ గర్వంగా చెబుతారు. ప్రపంచ యుద్ధాల నమూనాలు, దేశ ప్రముఖుల స్టాంపులు, రాజకీయ నాయకుల స్టాంప్‌లనూ ఆయన సేకరించారు. 1939లో 5వ జార్జ్ విడుదల చేసిన అణా, 1940లో 6వ జార్జ్ విడుదల చేసిన 3 పైసల స్టాంప్‌ల నుంచి నేటి వరకు విడుదల చేసిన నాణేలు ఆయన వద్ద ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసిన దేశ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల నాణేలను ఆయన సేకరించారు. యువతలో దేశ భక్తిని పెంపొందించడమే లక్ష్యంగా నాణేలు, స్టాంపులు, వస్తువులను సేకరిస్తున్నానని ఈ సందర్భంగా శివప్రకాష్ చెప్పారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న మహనీయుల గురించి నేటి తరానికి తెలియజెప్పాలని పిలుపునిచ్చారు.

ఆర్మీ ఉద్యోగికి ఘన నివాళి



పూర్ణ రామచంద్రారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్డీవో భాస్కరరెడ్డి తదితరులు

తగరపువలస: విధి నిర్వహణలో ఉండగా ఈ నెల 11న జమ్మూలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఆర్మీ ఉద్యోగి కొల్లి రామ పూర్ణచంద్రారెడ్డి భౌతిక కాయానికి ఆదివారం చిట్టివలసలోని ఆయన నివాసం వద్ద పలువురు ఘనంగా నివాళులర్పించారు. భీమిలి ఆర్డీవో పి.భాస్కరరెడ్డి, తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, సీఐ డి.రమేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కె.గురయ్యరెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామ పూర్ణ చంద్రారెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం జ్యూట్‌మిల్లు అవుట్‌గేట్ వద్ద గోస్తనీనది తీరాన ఉన్న శ్మశానవాటిక వరకు నిర్వహించిన అంతిమయాత్రలో వీరు పాల్గొన్నారు. అంత్యక్రియలకు ముందు ఆర్మీ, రెవెన్యూ అధికారులు తమ లాంఛనాలను పూర్తి చేశారు. శనివారం రాత్రి ప్రత్యేక విమానంలో విశాఖ చేరుకున్న రామ పూర్ణచంద్రారెడ్డి భౌతికకాయాన్ని విమానాశ్రయం నుంచి 11 గంటల సమయంలో చిట్టివలసలోని అతని నివాసానికి తరలించారు. ఆ సమయంలో మిత్రులు, బంధువులు, కుటుంబ సభ్యులు బాణసంచాతో తగరపువలస జాతీయ రహదారి నుంచి ఇంటికి తరలించారు.